పీఎం పాలెం సీఐగా బాలకృష్ణ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - పీఎం పాలెం: తాజాగా సీఐల బదిలీల్లో భాగంగా పీఎం పాలెం సిఐగా జి.బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. మహిళలు, బాలికల రక్షణకై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపడతామని, అసాంఘిక కార్యకలాపాలను అరికడతానన్నారు. విశాఖ నగరానికి మధురవాడ ప్రాంతంలో భూ తగాదాలు, హత్యలు, కిడ్నాప్‌లు, నేరసంస్కృతి లేకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

10, 11 తేదీల్లో దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఏయూ వీసీ

విశాలాంధ్ర - విశాఖ : ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖ, ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించనున్న కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు జయప్రదం అవ్వాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశి భూషణరావు అభిలషించారు. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో యూనివర్సిటీలోని టిఎల్ఎన్ సభా హాల్ వేదికగా జరుగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవిఆర్ రాజు, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పల రాజు, డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి తదితరులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాలకు యూనివర్సిటీ వేదిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలు జయప్రదం కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షులు జర్ర అప్పారావు, అరసం ప్రతినిధులు ఉప్పల అప్పల రాజు, డాక్టర్ సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో జరుగనున్న ఈ ఉత్సవాలకు వివిధ యూనివర్సిటీల ఆచార్యులు, ప్రముఖ కవులు, రచయితలు హాజరవుతారని తెలిపారు. తొలిరోజు సమావేశంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. అతిథిలుగా విశాలాంధ్ర జాతీయ పత్రిక సంపాదకులు ఆర్వి రామారావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, వై.విజయ్ కుమార్, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్య నారాయణ మూర్తి, అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు. అనంతరం జరిగే సదస్సులో దాశరథి జీవితం, సాహిత్య కృషిపై ఆచార్య కాత్యాయని విద్మహే, దాశరథి కవిత్వం-సామజిక జీవితంపై డాక్టర్ కోయి కోటేశ్వ రరావు, తెలంగాణ విముక్తి పోరాటంలో దాశరథి పాత్రపై ఆర్వి రామారావు, దాశరథి నాటక సాహిత్యంపై వల్లూరి శివప్రసాద్, గాలిబ్ గీతాలపై ఖాదర్ మోహియుద్దిన్, యాత్రా స్మృతిపై జీఎస్ చలం తదితరులతో ప్రముఖ రచయితలు ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ డివి సూర్యారావు తదితరుల ప్రసంగిస్తారని వివరించారు. సమాప నోత్సవంలో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం, జన సహకార సమితి నిర్వహణలో అవార్డుల ప్రధానం ఉంటుందని అరసం నేతలు తెలిపారు.

ఆచార్య కాత్యాయని విద్మహేకు కందుకూరి వీరేశలింగం పురస్కారం, డాక్టర్ కె.ముత్యంకు విరియాల లక్ష్మిపతి పురస్కారం, ఆర్వి రామారావుకు పురివండా అప్పల స్వామి పురస్కార ప్రదానం చేయనున్నట్టు వివరించారు.

నేడు జిల్లా స్థాయి గురుపూజోత్సవం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న వెంకోజీపాలెం వద్ద గల సిఎంఆర్ ఫంక్షన్ హాలు వేదికగా వేడుకలు జరుగుతాయని అన్నారు. అధ్యక్షోప న్యాసం, గౌరవ భారత రాష్ట్రపతి మరియు ప్రధానమంత్రి సందేశాలు, ముఖ్య అతిథి సందేశం ఉంటాయని అన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధానంతో కార్యక్రమం ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొననున్నట్లు కలెక్టర్ వివరించారు.

చిట్టివలస అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం చిట్టివలసలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడున్న చిన్నారులతో ముచ్చ టించారు. పిల్లల సంఖ్య, వారికి కల్పిస్తున్న కనీస సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు కలెక్టర్ చేతుల మీదుగా పోషణ కిట్లను అందజేశారు. నెలల చిన్నారికి ఐసీడీఎస్ అధికారులతో కలిసి అన్నప్రాసన చేశారు. పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీసిన కలెక్టర్ రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాన్ని మంచిగా నిర్వహించాలని, సకాలంలో గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఇతర అధికారులు ఉన్నారు.

గర్భిణీలకు, పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - మధురవాడ: అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు, ఆ పరిధిలోని గర్భిణులకు అందించే దైనందిన ఆహారంలో బలవర్ధకమైన పదార్థాలు ఉండే పౌష్టికాహారాన్ని అందించాలని కార్పొరేటర్ మొల్లి హేమలత తెలిపారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా 5వ వార్డ్ పరిధి మారికవలస అంగన్వాడి కేంద్రంలో పోషకాహార అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులకు, గర్భిణీలకు కోడిగ్రుడ్లు, పాలు, రాగిపిండి తదితర బలవర్ధక ఆహారాన్ని వారి దైనందిన ఆహారంలో భాగం చెయ్యాలన్నారు. అంగన్వాడీ లబ్దిదారులకు ప్రభుత్వం సరఫరా చేసే బాలసంజీవని కిట్‌లో బెల్లం, రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, వేరుశనగ చెక్కిలలో పోషక విలువలు పుష్కలంగా వుంటాయని, వాటిని గర్భిణీలకు, బాలింతలు, పిల్లలకు క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతం చేసి పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ముచ్చి రామునాయుడు, జనసేన ఆ వార్డు అధ్యక్షులు బెవర శివ, మణ్యాల సురేష్, తాతారావు, అంగన్వాడీ టీచర్ ఉమ, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు సునీత, ఏఎన్ఎం లోకేశ్వరి, మహిళ పోలీస్ దివ్య జ్యోతి, ఆశ వర్కర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా ప్యాకేజీలు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - భీమిలి: పర్యాటక రంగానికి ప్రసిద్దిగాంచిన విశాఖలో మరిన్ని వసతులు కల్పించాలని, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా విధానాలు రూపొందించాలని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్రూయిజ్ టూరిజానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ మెరుగైన వసతులు కల్పించాలని, ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించాలని సూచించారు. బుధవారం జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ఆయన భవిష్యత్తులో పర్యాటక రంగంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. విదేశాల్లో మాదిరిగా క్రూయిజ్ టూరిజానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కిచెప్పారు. ఈ పర్యటనలో భాగంగా భీమిలి పరిధిలోని పలు ప్రాంతాలను ఆయన సందర్శించారు. ముందుగా భీమిలిలోని సెయింట్ పీటర్ చర్చిని, సమీపంలో ఉన్న డచ్ సెరిమెనీ సమాధులను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. ఫాగ్ స్టాఫ్ సెమెట్రీలోని కట్టడాలను, సమాధులను, స్థూపాలను పరిశీలించిన ఆయన అక్కడి విశేషాలను ఫోనులో బంధించారు. అక్కడ నుంచి వెళ్లి భీమిలి లైట్ హౌస్‌ను చూసి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. రుషికొండ బీచ్‌లోని ఇప్పటి వరకు అమలు చేసిన పర్యాటక పద్ధతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టూరిజం బోటింగ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి దాని నిర్వహణకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. తొట్లకొండపై మరుగుదొడ్లు కట్టించాలని, ఇతర ప్రాంతాల్లో ఉన్న మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

5 నుంచి 12 గంటల పాటు తిరిగేలా ప్యాకేజీలు

విశాఖ అందాలను వీక్షించేందుకు వచ్చిన విదేశీ పర్యాటకులకు ఇక్కడ టూరిజం ప్రాంతాలను చూపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారు ఐదు నుంచి 12 గంటల పాటు సమయం వెచ్చించేలా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్రూయిజ్ టూరిజానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట టూరిజం ఆర్డీ ఫణి శ్రీనివాస్, టూరిజం ఉన్నతాధికారి దాస్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా పద్మావతి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ ఎస్.టి.వి.విద్యావతి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఈమె 2001 డి.ఎస్.సి ద్వారా 2002 జనవరిలో ఎస్.జి.టిగా రావికమతం మండలంలోని అప్పలంపాలెం గ్రామంలో ఉద్యోగంలో ప్రవేశించారు. తదుపరి దొండపూడి ప్రాథమిక పాఠశాలలో 2007 వరకు పనిచేసి ప్రభుత్వ బాలుర గృహంలో ఫారిన్ సర్వీస్‌పై వెళ్ళారు. అక్కడ వీధి బాలలు, బాల నేరస్థులతో సన్నిహితంగా మెలిగి అనేక మంది బాలుర ను సక్రమ మార్గంలో నడిపించుటకు కృషి చేశారు. 2009లో చినగదిలిలో పాత అడివివరం స్కూల్‌లో చేరారు. స్నేహబల రిసోర్స్ పర్సన్‌గా అనేక మండలాల్లో పర్యటించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. 2017లో టీ.అర్జాపురం ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు. 2021లో నాడు నేడు పనులలో మండలంలోనే మొదటి ప్రాజెక్టు పూర్తి చేసి 2021 లో మండల బెస్ట్ టీచర్ అవార్డు పొందారు.

అభివృద్ధి పనుల కోసం పోర్టు చైర్మన్‌కి ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పోర్టు చైర్మన్ అంగముత్తుకి పలు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం బుధవారం అందజేశారు. ఎస్.ఎల్ కాలువను ఆధునీకరించి, కాలువకు ఇరువైపులా మొక్కలు నాటాలని కోరారు. 34, 35, 39 వార్డులలో పోర్టు వారి సహకారంతో సామాజిక భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కింగ్ జార్జ్ హాస్పటిల్, విక్టోరియా హాస్పిటల్ లలో నూతన భవనాలను త్వరితగతిన నిర్మాణం చేపట్టాలన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో వున్న ఆక్షన్ బిల్డింగ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దక్షిణ నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్‌లు పంపిణీ చేపట్టాలని, హార్బర్‌లో 2 క్రేన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. 35వ వార్డ్ లక్ష్మీ నగర్‌లో నిర్మించే ఇళ్లకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. నెహ్రూ బజార్, జనతా బజార్ ఆధునీకరణలో పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణని అభినందించారు. దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు భాగస్వామ్యం వుంటుందని హామీ ఇచ్చారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు విజయవంతం

విశాలాంధ్ర - గాజువాక: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఉక్కు నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జాతీయ సమితి సమావేశాలు విజయవంతంగా ముగిసాయని ఏఐటీయూసీ జాతీయ సమితి ఉపాధ్యక్షులు, సమావేశాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు/కార్య నిర్వాహక అధ్యక్షులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్ రావు, స్టీల్ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశాలకు దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన దాదాపు 300 మంది కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశాలలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని లేదా సెయిల్‌లో తిరిగి విలీనం చెయ్యాలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, 7.3 మిలియన్ టన్నుల పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నడపాలని, ప్రస్తుతం కార్మిక వర్గంపై కేంద్రం చేస్తున్న దాడిని ఖండిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల, పరిశ్రమల పరిరక్షణ లాంటి పలు అంశాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ కొరకై మొత్తం 29 తీర్మానాలను హాజరైన కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ మూడు రోజుల సమితి సమావేశాల విజయవంతం కోసం శ్రమించిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులకు, కార్యకర్తలకు ధన్య వాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎ.మసేనురావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనక రాజు, జి.ఆనంద్, డొక్కా నర్సింగరావు, ఎస్.మోహన్ బాబు, ఎ.శివరామక్రిష్ణ, ప్రసన్న కుమార్, టి.ఎస్.ఎన్.దేముడు, త్రినాథ్, బి.ఎమ్.ఎల్.నాయుడు, చీకటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ స్వయంగా రక్తదానం చేసి దాని ఆవశ్యకతను చాటి చెప్పారు. ఒక్కరు రక్తదానం చెయ్యడం వల్ల ముగ్గురి ప్రాణాలను కాపాడిన వారవుతారని, దాత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్ఈ ఎం.బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మరో కొత్త వివాదం...

సీఎస్ఆర్ఎంవో పోస్టు కోసం కుస్తీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కేజీహెచ్‌లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కన్నా అధికార పెత్తనం కోసం కుర్చీలాటకే కొంతమంది వైద్యులు ఆరాటపడుతున్న తీరుపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఉత్తర్వులు లేకుండా సిఎస్ఆర్ఎంవో పోస్టు నియామకాలు జరుపుతున్నారంటూ కొంతమంది వైద్యులు చేసిన ఆరోపణలపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ అధికారికంగా ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. డిఎంఈ మౌలిక ఆదేశాల్లో భాగంగానే తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే సిఎస్ఆర్ఎంఓ పోస్ట్‌ను నియమిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తి ఉన్న సీనియర్ ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జి ఇస్తామంటూ సర్కిలర్ జారీపై దుమారమే రేగింది. డీఎం ఆదేశాలు మేరకే ఈ నియమకాలు చేపడుతున్నామని కేజీహెచ్ అధికారులు తెలియజేశారు. ఈ అధికారం డీఎంఈ కూడా లేదని సీనియర్ వైద్యులు అభిప్రాయపడుతున్నారు. 14 ఏళ్లుగా అర్హులు లేకపోవడంతో సిఎస్ఆర్ఎంవో పోస్టు ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు రావాలంటే సీనియార్టీతో పాటు ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ కోర్సు కూడా పూర్తి చేసి ఉండాలి. ఉన్నతా ధికారులే నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పలు ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలోనే ఆగమేఘాలపై ఈ పోస్టు భర్తీ చేస్తున్నట్లు తెలుస్తుంది. మా బాధలు మాకున్నాయి, మళ్లీ అదనపు బాధ్యతలు వద్దు బాబోయ్ అంటూ వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న అర్హులైన, పదోన్నతి కోసం వేచిఉన్న వైద్యులు. దరఖాస్తుకు ఈ నెల5వ తేదితో గడువు ముగియనుంది.

వరద బాధితులకు విరాళంగా ఏయూ ఉద్యోగుల ఒకరోజు మూల వేతనం - ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపనున్న ఏయూ అధికారులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం బోధన, బోధనేతర ఉద్యోగులు తమ ఒకరోజు మూల వేతనాన్ని వరదబాధితుల సహాయార్థం ఇవ్వనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ పరిసర ప్రాంతాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం ఏయూ అధికారులు గమనించారు. ఏయూ బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమై అధికారులు దీనిపై చర్చించారు. ఏయూ ఉద్యోగులంతా ఒకరోజు మూలవేతనాన్ని వరద బాధితులకు సహాయం అందించడానికి ముందుకు వచ్చారు. ఏయూ అధికారుల నిర్ణయం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. వరద బాధితులకు అండగా నిలవాలనే నిర్ణయాన్ని ఏయూ టీచింగ్, నాన్ టీచింగ్ జేఏసి స్వాగతించింది. త్వరలో ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు తెలిపారు.

ధరలు తగ్గించాలి: సీపీఐ నిరసన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన డీజిల్, పెట్రోలు, వంట గ్యాస్, బియ్యము, పప్పులు, వంటనూనె, విద్యుత్తు నిత్యావసర వస్తువుల ధరలు రద్దు చేయాలని సీపీఐ నేత జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుండి 6 వరకు ప్రజా ఆందోళన చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకి శ్రీ విజయ దుర్గ ఆటో వానర్ కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఇన్ గేట్ వద్ద గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జె.రాజారెడ్డి, సీపీఐ విశాఖ నగర నాయకులు జి.వామన మూర్తి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో డీజిల్, పెట్రోలు, వంటగ్యాసు నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని సంవత్సరానికి రెండు కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి దేశంలో ప్రతి పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ధరలు తగ్గించలేదు సరికదా మరింత భారీగా పెంచారని మండిపడ్డారు. డీజిల్, పెట్రోలు, నిత్యవసర వస్తువుల ధరలు పెంచి పేద ప్రజలు కడుపులు కొడుతున్నారని విమర్శించారు. ప్రజాధనాన్ని బడా కార్పొరేట్ సంస్థలైన అంబానీకి, అదాని, రిలయన్స్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తూ దేశ ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించి కార్మికులకు ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వై.వెంకట్, రావికృష్ణ, హెచ్.శేఖర్, జై.గణేష్ కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

1301వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1301వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ గడచిన రెండు రోజులుగా బ్లాస్ట్ ఫర్నేస్-3 ఒకటి మాత్రమే ఉత్పత్తి చేస్తుందని అన్నారు. స్థానిక స్టీల్ యాజమాన్యం ఉత్పత్తి విషయంలో ఎటువంటి శ్రద్ధ చూపించడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. అలాగే కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహ రిస్తోందని ఆయన వివరించారు. కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన రాస్తారోకోలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. దీనిలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు కె.గంగాధర్, వీరస్వామి, విజికె రాజు, డిఎస్‌విఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠనంలో చాందినికి మొదటి బహుమతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బంక చాందినికి పద్య పఠనంలో మొదటి బహుమతి గెలుపొందింది. గోపాలపట్నం జడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు భాగంగా పద్య పఠనం, నృత్య ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా ఆనందపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థినీ బంక చాందిని పద్య పఠనంలో ప్రథమ బహుమతి గెలుచుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణ పట్నాయక్, తెలుగు ఉపాధ్యాయులు శంకర్రావు, ముత్యాల నాయుడు, భాస్కరరావు తదితర ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

టిఎస్ఆర్ డెంటల్ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాపురం: పేద ప్రజలకు అందుబాటు ధరల్లోనే నాణ్యమైన దంత వైద్యాన్ని అందించాలనే ఆలోచనతో శ్రీహరిపురంలో ఏర్పాటు చేసిన టిఎస్ఆర్ డెంటల్ క్లినిక్‌ను బుధవారం జివిఎంసి 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతంలో ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ దంత వైద్యశాల ప్రజలకు మరింత చేరువయ్యేలా నాణ్యమైన వైద్యసేవలను అందుబాటు ధరలలో అందించి ప్రజల మన్ననలు పొంది దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దంత వైద్య నిపుణురాలు డాక్టర్ కొయిలాడ రోజాదేవి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి : 2
గురువారం 5, సెప్టెంబర్, 2024

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా తర్ఫీదు ఇవ్వాలి

చిట్టివలస జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - తగరపువలస: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా తర్ఫీదు ఇవ్వాలని, ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి బంగారు భవిష్యత్తును అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కరిక్యులమ్ ను మరింత పటిష్టంగా అమలు చేయాలని, వారిలో సాఫ్ట్ స్కిల్స్ పెరిగేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఉదయం భీమిలి పరిధిలోని చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. మధ్యాహ్న భోజన పథకం, సీబీఎస్ఈ విధానం అమలు, అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో పది, ఆరో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వివిధ సబ్జెక్టులను బోధించి దానిపై విద్యార్థులను విభిన్న కోణాల్లో ప్రశ్నించారు. పదో తరగతి బాలుర సెక్షన్‌కు వెళ్లి ఫిజిక్స్ బోధించిన కలెక్టర్ రిఫ్లక్షన్ అనే అంశంపై పాఠం చెప్పారు. అనంతరం సంబంధిత అంశంపై విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. సీబీఎస్ఈ విధానం ఎంత వరకు దోహదపడుతుందో పరిశీలించారు. అనంతరం పదో తరగతి బాలికల సెక్షన్కు వెళ్లిన ఆయన అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. సోషల్ సబ్జెక్టును బోధించి అందులో ప్రశ్నలు సంధించారు. అలాగే అదే పాఠశాలలోని ఆరో తరగతి చదువుతున్న చిన్నారులతో మాట్లాడిన కలెక్టర్ పలు అంశాలపై కుశల ప్రశ్నలు వేశారు. జాగ్రఫీ సబ్జెక్టును బోధించిన ఆయన విభిన్న కోణాల్లో ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు కరిక్యులమ్ ను అనుసరించటంతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలని, మానసిక ఉల్లాసం పొందేలా కొన్ని ప్రక్రియలు చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాల్లో కలియ తిరిగిన ఆయన పలు తరగతి గదులను, మధ్యాహ్న భోజనం పథక శాలను సందర్శించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు ఉన్నారు.

పెరుగుతున్న ప్రీ-డయాబెటిస్ కేసులు

పోషకాహారంతో ప్రీ డయాబెటీస్ నిర్వహణ

డా. రోహిణి పాటిల్

విశాలాంధ్ర- విశాఖపట్నం: దేశవ్యాప్తంగా ప్రీ డయాబెటిస్ కేసులు గణనీయ సంఖ్యలో పెరుగుతున్నాయని, దీని నిర్వహణకు పోషకాహారం ఒక్కటే సరైన పరిష్కార మార్గమని ప్రముఖ వైద్యులు, పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ హోటల్ లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీలో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, భారతదేశంలో 136 మిలియన్ల మంది లేదా జనాభాలో 15.3 శాతం మంది ప్రీడయాబెటిస్‌తో జీవిస్తున్నారన్నారు. జనాభాలో 6-15 శాతం మందికి ప్రీడయాబెటిస్ ఉన్నట్లు అంచనా ఉందన్నారు. 2017 తో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల కనిపిస్తుందని చెప్పారు. పోషకాహారంతో దీన్ని అధిగమించవచ్చని, ప్రీ-డయాబెటిక్ డైట్‌లో బాదం, ఆకుకూరలు, క్లీన్ ప్రోటీన్, తృణధాన్యాలు తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. బాదంలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఫైబర్ పుష్కలంగా ఉంటాయని షుగర్‌ని అదుపులో ఉంచుతాయి అన్నారు. బచ్చలికూర, మెంతికూర తోటకూర వంటి ఆకు కూరలు తక్కువ పిండి పదార్థాలు మరియు అధిక ఫైబర్ కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి తోడ్పడతాయన్నారు. గ్రీక్ యోగర్ట్ ఇది ప్రేగు ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని, దీనిలోని ప్రోటీన్ కంటెంట్ కార్బోహైడ్రేట్ జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుందన్నారు. లీన్ ప్రోటీన్ కలిగిన చేపలు, చికెన్, గుడ్లు, చిక్కుళ్ళు వంటి లీన్ ప్రొటీన్లు రక్తంలో చక్కెర నిర్వహణకు చాలా ముఖ్యమైనవని చెప్పారు. బ్రౌన్ రైస్, క్వినోవా బార్లీ వంటి తృణధాన్యాలలో ఫైబర్ అధికంగా ఉంటుందనీ, ఇది చక్కెర శోషణను నెమ్మదింపజేస్తుందన్నారు.

వరద సహాయక చర్యల్లో నిమగ్నమైన జీవీఎంసీ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు చేరుకొని బుధవారం వరద ముంపు ప్రాంతాల్లో పాల్గొని ప్రజలకు సేవలు అందిస్తున్నారని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ బుధవారం విజయవాడ నుండి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విజయవాడ 64 వార్డులో "నున్న" ప్రాంతం వద్ద గల కండ్రేగ ప్రదేశాలలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ జీవీఎంసీ ఉద్యోగులతో పంపిణీ చేసే కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ గా తాను స్వయంగా నిర్వహిస్తు పర్యవేక్షణ చేస్తున్నానని ఆయన తెలిపారు. జీవీఎంసీ అధికారులు,ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు విజయవాడలో గల 20వ వార్డు నుండి 64వ వార్డు వరకు పలుచోట్ల ప్రజలకు అందించే సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నారని, సహాయక చర్యల్లో ఇబ్బందులు కలుగకుండా ఉద్యోగులకు అధికారులకు మధ్య సమాచారం నిమిత్తం జీవీఎంసీ వైర్లెస్ వాకి టాకీ సెట్ ల ద్వారా సమాచారాన్ని అందించడంలో సులభతరం చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. తనతో పాటు చైల్డ్ వెల్ఫేర్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కూడా వరద ముంపు ప్రాంతాల్లో ఆహార పొట్లాలు పంపిణీ కార్యక్రమంలో సేవలందిస్తున్నారని కమిషనర్ తెలిపారు.

ఆ కంపెనీ సిఎస్ఆర్ నిధులు ఏమయ్యాయి....?

ఇది పాండ్రంకి టాటా గ్లూకోజ్ కంపెనీ పరిస్థితి

విశాలాంధ్ర - ఆనందపురం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలో గ్రామానికి ఆనుకొని ఉన్న లైఫ్ లైన్ ఫుడ్స్ అండ్ ఆగ్రో ప్రోడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రముఖ కంపెనీ టాటా ఉత్పత్తులను తయారుచేస్తుంది. గతంలో చాలా ఆరోపణల మధ్య వివాదాల మధ్య ఈ కంపెనీ నడుస్తూ వచ్చింది. ఆ మధ్యకాలంలో గ్రామ ప్రజలు పూర్తిగా కంపెనీ యాజమాన్యంపై తిరగబడడం. అందుకు ప్రధాన కంపెనీ మొదలు పెట్టిన దగ్గర నుంచి గ్రామంలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై ఊరంతా ఒకేసారి తిరగబడి కంపెనీ యాజమాన్యంపై కంపెనీ మూసివేయాలని యజమాన్యంపై అప్పట్లో తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. అప్పట్లో కొంతమంది నాయకులు అండదండలతో కథ అలా సుఖాంతం చేశారు. దానితోపాటు సిఎస్ఆర్ నిధులను ఆ గ్రామాలకు పూర్తిగా వినియోగించడం ఆపేసింది. కనీసం ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని అయినా సరే ప్రభుత్వ అధికారులు ఈ కంపెనీను సిఎస్ఆర్ నిధులు అడిగిన దాఖలాలే లేవు .కనీసం కంపెనీ ముందర కూడా మొక్కలు చెట్లు నాటే కార్యక్రమం చేయను లేదు. ఈ విషయమై కొంతమంది స్థానికులను అడగగా సి ఎస్ ఆర్ నిధులు అంటే ఏమిటి అని గ్రామానికి ఈ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులు ఖర్చు చేసినట్లు మాకు తెలియదని వారు అంటున్నారు .ఈ కంపెనీ చుట్టుపక్కల అంతంత మాత్రమే పరిశుభ్రత పాటిస్తున్నారు .వర్షం పడినట్లయితే కంపెనీ ఎదుట రోడ్డు నుంచి వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది అవుతుంది. చివరకు కంపెనీ ఎదుట ఇది ఏ కంపెనీలో తెలుసుకోవడానికి కనీసం కంపెనీ పేరు న బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని దానివల్ల కంపేనీ లోపల ఏమి తయారు చేస్తున్నారో అని పలు అనుమానాలకు తావిస్తుందని ఆ రోడ్డును పోయిన చోధకులు అంటున్నారు.

కోరాడ శ్రీనివాసరావుకు గంటా అభినందన

విశాలాంధ్ర - పీఎం పాలెం: భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రాష్ట్ర కళింగ వైశ్య ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు కలుసుకున్నారు. రాష్ట్ర కళింగ వైశ్య ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావును భీమిలి నియోజ కవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సన్మానం చేయడం జరిగింది. భీమిలి నియోజవర్గం మధురవాడ కళింగ వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సంఘంలో చాలామంది చిరు వ్యాపారులు ఉన్నారుని వాళ్లకి ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే,ఏమైనా శుభకార్యాలు పెళ్లిళ్ల చేసుకోవాలంటే, ఫంక్షన్ హాల్‌కి లక్షలాది రూపాయలు చెల్లించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని, తమరు మా కళింగ వైశ్యలో దృష్టిలో పెట్టుకొని, ఒక సామాజిక భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి హామీ ఇవ్వడం జరిగింది. మధురవాడ కళింగ వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగి సాంబశివరావు మాట్లాడుతూ మధురవాడలో బక్కన పాలెం రోడ్డు డీమార్ట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో పాటు, కొమ్మాది జంక్షన్ నుండి గాజువాక వరకు నాన్ స్టాప్ బస్సులు మరియు బి సి డి సర్టిఫికెట్ల గంటా శ్రీనివాసరావు ను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భోగి సాంబశివరావు, సెక్రెటరీ పొట్నూరు గణేష్, టీవిఆర్ మూర్తి, కోరాడ వెంకటరమణ, జామి లక్ష్మణ మూర్తి, కోరాడ వెంకట సుబ్రహ్మణ్యం, వడ్డీ దుర్గాప్రసాద్, సూరు చంద్రశేఖర రావు, బరాటం రమణ, ఆరిలోవ సంఘం అధ్యక్షులు జామి సాంబ మూర్తి, సెక్రెటరీ వడ్డీ నాగరాజు, ఆరిలోవ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుసులువాడను పరిశీలించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధుల బృందం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలోని మైనింగ్ కొండను బుధవారం సాయంత్రం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజయ్ శర్మ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ శర్మ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగే మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుసులవాడ భూముల్లో క్వార్ట్ జైట్ మైనింగ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎస్ 1533 నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కుసులవాడ సర్వే నెంబరు 104లోగల 69 హెక్టార్లలో 7.991 హెక్టార్లలో రఫ్ స్టోన్ గ్రావెల్, క్వార్జైట్ మైనింగ్కు విఆర్ ఇన్ఫ్రా అండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థకు అనుమతులు కొండలు, ప్రకృతిని ధ్వంసం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర ప్రమాదమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియదా ? అని ప్రశ్నించారు. ప్రకృతి సంపదను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. కానీ ఆ ప్రభుత్వాలే ప్రకృతి విధ్వంసానికి పూనుకోవడం దారుణమని.,కుసులవాడ కొండల ధ్వంసం వల్ల చుట్టుపక్కల 60 గ్రామాల ప్రజలు కు పర్యావరణానికి, ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆ ప్రాంత ప్రజల జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు ఆపార నష్టం కలుగుతుందని తెలిపారు. పశు సంపద నష్టపోతారని, గాలి, తాగునీరు కలుషితమవుతాయని, కాలుష్య ప్రమాదం పెరుగుతుందని అన్నారు. తుపాను వంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుసుల వాడ ఎస్సి కాలనీ, చిన్నయ్యపాలెం ఎస్టి కాలనీ, రేగాని గూడెం, గొల్లలపాలెం, ఇచ్ఛాపురం తదితర గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రుషికొండ, ప్రకృతి ధ్వంసానికి పూనుకొంటే సిపిఎంతో పాటు టిడిపి, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పర్యావరణ కాముకులు, ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేశాయని వెంటనే అనుమతులు రద్దు చేసి పర్యావరణాన్ని కాపాడాలని అభివృద్ధి వేదిక బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో అభివృద్ధి వేదిక కమిటీ మెంబర్ కూన వెంకట్రావు, ఎం ప్రదీప్, పి ప్రసాద్, సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, తదితరులు కుసులువాడ కొండను పరిశీలించారు.

యూత్ పార్లమెంటులో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం కస్తుర్భాగాంధీ విద్యార్థులు యూత్ పార్లమెంటులో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగమణి తెలిపారు. గీతం యూనివర్సిటీలో ఆది, సోమవారాలలో యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఆనందపురం కస్తూరిబా గాంధీ విద్యార్థులు ఢిల్లీశ్వరి, శ్రీవర్షిని, అలేఖ్య విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి అతిధుల చేతులమీదగా మెమొంటోలు బహుమతులు అంద జేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏపీసి శ్రీనివాసరావు, కేజీబీవీ ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగమణి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నిర్లక్ష్యం వహిస్తున్న పారిశుధ్య కార్మికులు లారీల్లో తరలిస్తున్న చెత్తపై తార్పానీలు కప్పని వైనం

విశాలాంధ్ర - ఆనందపురం: నిత్యం డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలిస్తున్న లారీలు రోజుకు అనేకం రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఆనందపురం రూరల్ ప్రదేశాల నుండి అలాగే విశాఖ సిటీ నుండి బోరవానిపాలెం డంపింగ్ యార్డుకు చెత్తను చేరవేసే ప్రక్రియలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం ఇచ్చారని పలువురు వాహనదారులు ప్రజలు వాపోతున్నారు. చెత్తను తరలించే లారీలపై కప్పకుండా నిర్లక్ష్యంగా విధులు చేపడుతున్నారని, కొన్నిచోట్ల చెత్త రోడ్డుపైనే పడిపోతుందని, పైన తార్పాన్లతో మూసి వేసినట్లయితే క్రిందకు పడకుండా ఉంటుందని వాహనదారులు ప్రజలు వాపోతున్నారు. చెత్తతో తరలించే లారీలు తీవ్రమైన దుర్వాసన వెద జల్లడం దానికి తోడు పైన కప్పకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు లారీ డ్రైవర్లు జాగ్రత్తలు వహించాలని పలువురు కోరుతున్నారు.

మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం కృష్ణంరాజుపేట జిల్లా ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు విస్తరిస్తున్న ఈ సమయంలో నీటి కాలుష్యం గాలి కాలుష్యం ద్వారా వ్యాప్తి చెందుతున్న ఈ వ్యాధుల నుంచి ప్రజలు తమ తమ కాపాడుకోవడానికి తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీరు తాగాలని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి

సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. మరిగించిన నీరు పిల్లలకు ఇస్తే వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది అంతేకాకుండా ఈగలు దోమలు వాలకుండా పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. నిలువ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదని, బయట దుకాణాలలో బహిరంగంగా అమ్ముతున్న ఆహార పదార్థాలు పిల్లల తినకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పిల్లల్లో జ్వరము తగ్గకుండా ఉన్నప్పుడు వెంటనే డాక్టర్ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించాలన్నారు. ఈ విషయాల న్నింటిపై గ్రామంలో అన్ని వీధులలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో శ్రద్ధ చూపించాలన్నారు.

అక్రమ పొగాకు వ్యాపారం నుంచి భారతదేశానికి విముక్తి కల్పిస్తామని ప్రతిజ్ఞ

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్, భారతదేశ అనుబంధ సంస్థ, ఐపిఎం ఇండియా, భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు మరియు వినియోగదారులను రక్షించేందుకు అక్రమ పొగాకు వ్యాపార నిరోధానికి తన నిబద్ధతను బలపరుస్తుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అక్రమ పొగాకు వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా పెద్ద ముప్పుతో సవాలు గా ఉందన్నారు. భారతదేశంలో ఇటీవలి అక్రమ విక్రయాలు గణ నీయంగా పెరిగాయి. ఇటువంటి అక్రమ విక్రయాలు కాలక్రమేణా పెరుగుతూనే ఉన్నాయి. అలాగే, 2022 ఫిక్కి క్యాస్కేడ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో అక్రమ సిగరెట్ల మొత్తం మార్కెట్ రూ. 22,930 కోట్లుగా అంచనా వేయబడింది. నివేదికల ప్రకారం, ప్రభుత్వానికి ఇది భారీ నష్టం. పొగాకు పరిశ్రమలో అక్రమ మార్కెట్లు 2022 నాటికి భారతదేశంలో రూ. 13,331 కోట్లు కాగా, ఇది 2012లో రూ. 6,240 కోట్లుగా ఉంది. అప్పటితో పోల్చితే ఇది 46 శాతం పెరిగింది.

దేశంలో బిజెపి అవినీతి రహిత పాలన

పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశంలో అవినీతి రహిత కావున బిజెపి ప్రభుత్వం అందిస్తుంది రాష్ట్ర అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందని ,స్టీల్ ప్లాంట్ పరీక్షించే మార్గాలను సైతం ఎప్పటికప్పుడు వివరిస్తూనే ఉన్నామన్నారు. విశాఖ రైల్వే జోన్ కు గత వైసిపి ప్రభుత్వం అసలు భూమి ఇవ్వలేదు . అందువల్లే రైల్వే జోన్ ఆలస్యం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు బిజెపి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది అన్నారు. పురంధేశ్వరి విశాఖ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఆరేళ్లకు ఒకసారి సభ్యత నమోదు ప్రక్రియను చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 38 లక్షల మంది సభ్యులు భారతీయ జనతా పార్టీలో ఉన్నారన్నారు..మూడు దశల్లో భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం చేస్తున్నాం.అక్టోబర్ నెల అక్కడితో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిస్తుందన్నారు. విజయవాడ వరదలు దురదృష్టకరమని, విజయవాడ వరదల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, శ్రేణులు చురుగ్గా పాల్గొంటున్నారని, వరద బాధితులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ,మాజీ ఎంపీ జీవిఎల్. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకం

యంగ్ ఇండియన్స్ పార్లమెంట్‌లో ఎంపి పురంధేశ్వరి

విశాలాంధ్ర - మధురవాడ: జాతి నిర్మాణంలో, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో యువత పాత్ర కీలకం అని పార్లమెంట్ సభ్యురాలు డి.పురంధేశ్వరి పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) అనుబంధ యువజన విభాగం యంగ్ ఇండియన్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ కార్యక్రమం ముగింపు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజం పట్ల, దేశ భవిష్యత్తు పట్ల లోతైన అవగాహన గల యువత అవసరం దేశానికి ఉందని అమె తెలిపారు. యువత పార్లమెంటరి వ్యవస్థను అర్థం చేసుకోవాలని, నాయకత్వలక్షణాలను పెంచుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ భారత దేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే ఉన్నతమైనదన్నారు. యువతను చైతన్యవంతం చేయడంలో యంగ్ ఇండియన్స్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యువతకు ఉత్తమ పార్లమెంటేరియన్, లీడర్‌షిప్ ఎక్సలెన్స్, బెస్ట్ లీడర్ ఆఫ్ ద హౌస్, బెస్ట్ అపోజిషన్ లీడర్ ఆఫ్ ద హౌస్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్ జాతీయ అధ్యక్షుడు దర్శన్ ముతా విశాఖ శాఖ అధ్యక్షుడు హర్షనందన్, డాక్టర్ బి.శ్రావిణి, సదఫ్ మెహిది తదితరులు పాల్గొన్నారు.